


*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

ఇదిగిదిగో, ఈగో..

“'యామీ, నువ్వేనా?” ఎయిర్ పోర్ట్ లో ఎదురయిన స్నేహితురాలిని ఆనందంగా వాటేసుకుంది సంధ్య..

" సంజూ! ఎన్నాళ్ళయిందే నిన్ను చూసి? ఎలా ఉన్నావు?” స్నేహితురాలిని ప్రేమగా చూస్తూ అంది యామిని కూడా..

" కాదూ మరి.. ఐదారేళ్ళయినా అయిందేమో.. నువ్వో చోట, నేనో చోట.. ఈ టెక్నాలజీ పుణ్యమా అని ఈ మధ్య తరచూ మాట్లాడుకుంటున్నాం గానీ.." అంది సంధ్య..

ఇద్దరూ చేతులు పట్టుకుని ఉండిపోయారు..

మాటలక్కర్లేని మౌనం ఇద్దరి మధ్యా..

అలా ఎన్ని క్షణాలు గడిచేవో? శ్రీదేవి వచ్చి పలకరించకపోతే..

"హలో, నా స్మార్టీ ఫ్రెండ్స్!!" అంటూ వచ్చింది శ్రీదేవి.. ఆమె ఎక్కడుంటే అక్కడే సందడి.. అందరితోనూ ఒకేలా ఉండగలగడం ఆమె ప్రత్యేకత..

"వచ్చేశారా? వెరీ గుడ్!! అరుదైన మన రీయూనియన్ కి స్వాగతం, సుస్వాగతం.." అన్నాడు అప్పుడే వారి దగ్గరకు నడిచి వస్తున్న రాజశేఖర్.. అతని వెనుకే ప్రసాద్...

" హలో, రాజా, ప్రసాద్.." అంటూ పలకరించారు వచ్చిన వారిద్దరినీ.

ఇంటర్ పాసయ్యాకా అందరూ ఐదేళ్ళ లా కోర్స్ లో ఎంతో ప్రతిష్టాత్మకమైన కాలేజ్ లో కలిసి చదువుకున్న వాళ్ళ క్లాస్ వారి రీయూనియన్ కోసం వచ్చారు వాళ్ళందరూ..

కాలేజీ వదిలి వెళ్ళాకా, అందరూ తలో మూలా అయిన వారిని ఈ మధ్యనే కలిపి,రాజశేఖర్, ప్రసాద్ పూనుకుని మూడురోజులపాటు అందరూ కలిసి ఉండేట్టుగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు..

ఊరికి కొద్దిగా దూరంలో ఉన్న ఒక రిజార్ట్ బుక్ చేశారు. దాదాపు అరవై మంది వచ్చారు.

లాయర్లయ్యాకా రకరకాల రంగాలల్లో స్థిరపడ్డారు వాళ్ళు.. కాలేజీలో లెక్చరర్లనించి కార్పొరేట్ లాయర్లదాకా, స్వదేశంలో స్వంత ప్రాక్టీస్ నించి, హై కోర్టు లాయర్లదాకా.. కొద్దిమంది విదేశాల్లో పేరుతెచ్చుకున్న అటార్నీలుగా స్థిరపడ్డారు..

యామిని అమెరికాలో ఉంటుంది.. సంధ్య ముంబయి లో కార్పొరేట్ లాయర్ గా పనిచేస్తుంది..

రిసార్ట్ చే, రి ఫ్రెష్ అయ్యాకా అందరూ కలిసి ఒకరినొకరు తిరిగి పలకరించుకునిపార్టీ హాల్ లో చేరారు.

మొదటిరోజు ఎంతో ఆహ్లాదంగా సాగింది...

కేరింతలు, తుళ్ళింతలు

కలబోసుకున్న జ్ఞాపకాలు.. పొలమారిన తీపిగురుతులు...

చిన్నపిల్లలైపోయిన ప్రౌఢవనితలు.. నడివయస్కులు.. అంబరాలనంటిన ఆనందాలు..

చిన్నా, పెద్దా గ్రూపుల్లో చేరిన జతగాళ్ళు, జతగత్తెలు..

ఇరవై ఐదేళ్ళ తర్వాత కలిశారు కొందరు.. కొందరు మధ్యలో కలిసినా తక్కువే..

చిన్నతనాల చిరురెక్కలు పెద్దవై, వాటిని మరింత పెంచుకుని వీలైనంత ఎత్తుకు ఎగరాలన్న ప్రయత్నాలు..

ఆ మార్గంలో స్వతహాగా ఎదురయ్యే తీయని ప్రతిబంధకాలు, కాస్త చేదైన ఒడిదుడుకులు..

వీటన్నింటి మధ్యా సహజంగా మరుగున పడ్డ స్నేహాలు కొన్ని..

అప్పటినించీ ఇప్పటివరకూ సాగుతున్న స్నేహాలు కొన్ని..

ఇలా కలబోసి అల్లిన కలనేత చీరలాంటి రీయూనియన్..

రెండు బెడ్ రూములున్న కాటేజీల్లో ఒక దాంట్లో ముగ్గురుండేట్లు గా ఇరవై కాటేజీలు తీసుకున్నారు వచ్చిన అరవై మందికి సరిపడేలా..

ప్రత్యేకంగా యామినీ, సంధ్యలతో ఉంటానని ముందే రాజశేఖర్ ని అడిగి మరీ అదే కాటేజ్ లో తన పేరు వచ్చేలా చూసుకుంది శ్రీదేవి.

హైస్కూల్ నించీ స్నేహితులు వాళ్ళిద్దరూ..

శ్రీదేవి వారికి ఇంటర్ నించీ క్లాస్ మేట్. చదువులోనూ, ఆటపాటల్లోనూ, అందచందాల్లోనూ సమ ఉజ్జీలుగా ఉండే ఆ స్నేహితురాళ్ళిద్దరూ అంటే తగని ఇష్టం శ్రీదేవికి..

అసూయ, కాంపిటీషన్ లాంటివేమీ ఉండేవి కాదు ఆమెలో. తన స్నేహితులెవరేం సాధించినా ఒకేలా సంతోష పడేది. అందరితోనూ ఒకేలా ఉండేది..దానివల్లనేఆమెనెవరూ తమకి దగ్గర స్నేహితురాలిగా అనుకోకపోయినా ఆమె పెద్ద బాధ పడినట్టే అనిపించేది కాదు..

వారిద్దరూ ఎప్పుడూ ఒకరితో ఒకరు పోటీ పడుతూ అన్నింట్లోనూ ముందు ఉండడం ఆమెకెంతో నచ్చేది.. ఆ అభిమానంతోనే వారిద్దరితోనూ కలిసి మూడురోజులు దగ్గరగా గడిపే అవకాశాన్ని అంతగా స్వాగతించింది..

రెండో రోజంతా కలిసి ఉండేట్టు, మూడోరోజు మధ్యాహ్నం భోజనాలయ్యాకా ఎవరి వీలును బట్టి వారు ప్రయాణమయ్యేందుకు ముందే ఏర్పాట్లు చేశారు. రైల్వే స్టేషన్ కి, ఎయిర్పోర్ట్ కి కావలసిన బస్సులు ఏర్పాటు చేశారు..

'ఇవన్నీ చూస్తే మనలో ఎవరో పిల్లల పెళ్ళి చేస్తున్నటుంది' అన్నారు ఎవరో..

"త్వరలో అవీ వస్తాయి" అన్నాడు సుబ్రహ్మణ్యం..

" కరక్ట్.. ఆ ఛాన్స్ ముందు ఆడవారికే "అని జోకులేశారు మరొకరు..

ఆరుబయట కూర్చుని కబుర్లు చెప్పుకున్నారు అందరూ..

అర్ధరాత్రి దాటాకా ఎవరి గదులకి వారు మళ్ళాకా, మనసు తీరని మరికొందరు చిన్న గ్రూపుల్లో ముచ్చట్లు కొనసాగించారు..

'ఇలా కలిసినప్పుడే అనిపిస్తుంది ఇన్నాళ్ళూ కలవకుండా ఎలా ఉన్నామా?' అని..

రెండో రోజు బద్ధకంగా నిద్ర లేచారు అందరూ..

ఏ పనీ చెయ్యకుండా ఉండడం బావుంది..

ఇళ్ళకి ఫోన్ లు చేసి మాట్లాడుకోడాలయ్యాకా, బ్రేక్ఫాస్ట్ దగ్గరే తొందర పెట్టారు రాజా, ప్రసాద్..

సర్ప్రైజ్ అంటూ అందరినీ పార్టీ హాల్లోకి పరుగులు తీయించారు..

అక్కడో నాలుగు రకాల ఆట పాటల పోటీలు పెట్టారు.. గెలిచిన వాళ్ళకి బహుమతులిచ్చారు.. రెండు యామినీ, మరో రెండు సంధ్యా గెలిచారు. ఒకరినొకరు చూసి నవ్వుకున్నారు..

ఆ తర్వాత లంచ్ టైము కావడంతో బ్రేక్ అన్నారు..

'ఇప్పుడే మేము చెప్పిన సర్ప్రైజ్.. ముందేమీ ప్రిపరేషన్ లేకుండా తమ కొచ్చిన విద్య ప్రదర్శించడమే అది' అంటూ చెప్పారు.

'ముందే చెప్పి ఉంటే మేము సిద్ధంగా వచ్చేవాళ్ళం కదా? ఇప్పటికిప్పుడంటే ఎలా?' అని గొడవ పెట్టారు ఏదో ఒకటి చెయ్యడం వచ్చినవాళ్ళూ, చేయడానికి ఆసక్తి ఉన్నవాళ్ళు..

'ముందే చెప్తే మజా ఏముంది? మీకేది వస్తే అదే.. ఎలా వస్తే అలాగే' అన్నారు నిర్వాహకులు..

దాదాపు ఇరవైమంది దాకా ఉత్సాహవంతులు తేలారు.. మిమిక్రీ, పాట, ఆట లాంటివిభాగాల్లో..

మిగతావాళ్ళకి పేచీయే లేదు..

బాగా తిని బలంగా చప్పట్లు కొడతామన్నారు..

భోజనాలయ్యాకా, మిత్రులందరూ తిరిగి సమావేశమయ్యారు..

సంధ్యా, యామినీ ఇద్దరూ రాలేదు ఇంకా..

కార్యక్రమం మొదలైంది..

మిత్రుల ఆటపాటల్ని అందరూ ఎంజాయ్ చేస్తున్నారు...

స్టేజ్ మీద ఒకతను పాట పాడుతుండగా ఒక చిన్న బేగ్ తీసుకుని వచ్చింది యామిని.

రిజార్ట్ లో తమకు సహాయపడుతున్న ఒక అమ్మాయితో మాట్లాడి ఆ పార్టీ హాల్ కి పక్కనున్న చిన్న గదిలోకి వెళ్ళి తలుపులు బిగించుకుంది..

స్టేజ్ మీద పాట పాడుతున్న అతని చూపు తప్ప మిగతా అందరిదీ అటు వైపు అప్రయత్నంగానే మళ్ళింది..

తర్వాత ఆమె బయటకి రావడమూ, తన మొబైల్ ఫోన్ లో డౌన్ లోడ్ చేసిన రెండు మూడు పాటలకి నాట్యం చెయ్యడమూ, మధ్యలో చక చకా వెళ్ళి తన్ డ్రెస్ లో కొద్దిపాటి మార్పులు ఎంతో చాకచక్యంగా చేసుకోవడమూ అన్నీ ఎంతో బాగా అయ్యాయి..

అందరూ ఆమె డాన్స్ ని, సమయస్ఫూర్తి మెచ్చుకున్నట్లుగా చప్పట్లు కొట్టారు.. అందంగా, హుందాగా స్టేజ్ మీదకి నడిచి వెళ్ళి అందరికీ అభివాదం చేసింది ఆమె..

మధ్యలో స్నేహితులు పాడే సమయాన్ని అలా చక్కగా వినియోగించుకుని భలే చేసింది అని అందరూ చాలా అభినందించారు.

తర్వాత ఇతర మిత్రుల కార్యక్రమాలు సాగాయి..

అంతలో స్టేజ్ మీద తటిల్లతలా మెరిసింది సంధ్య..

మరో ఇరవై నిమిషాల పాటు తన భరతనాట్య ప్రదర్శనతో అందరినీ మంత్ర ముగ్ధుల్ని చేసింది.. ఆమె తన చిన్నప్పటి కళని, సాధననీ వదులుకోలేదని అందరికీ అర్ధమయింది. ఆమె ప్రదర్శన పూర్తయ్యేసరికి అందరూ అప్రయత్నంగానే లేచి నిలబడి చప్పట్ల మోత మోగించారు..

సరదాగా తాము ఏర్పాటు చేసిన ఈ సర్ప్రైజ్ అంకానికింత స్పందన లభించడం చాలా సంతోషంగా ఉందని రాజశేఖర్ అంటూ సంధ్య, యామిని లతో పాటు మరో ముగ్గురు మిత్రులకి ప్రత్యేక బహుమతులు ప్రకటించాడు.

కార్యక్రమం పూర్తి అయ్యాకా, రాత్రి భోజనాలకి ముందు అందరూ తమ కాటేజ్ లకి చేరుకున్నారు.. మరో ఇద్దరు స్నేహితులతో నిన్న మాట్లాడడం కుదరలేదనుకున్న శ్రీదేవి వారితో పాటు స్విమ్మింగ్ పూల్ దాకా వెళ్ళి వెనక్కి తిరిగి వచ్చేసరికి తమ కాటేజ్ లోని నిశ్శబ్దం మాములుగా అనిపించలేదు..

ఏదో జరిగిందని మనసు చెప్పింది కానీ ఏం జరిగిందో తెలీలేదు..

రెండు బెడ్ రూములున్నా వాటిని నిన్న కేవలం సామాన్లు పెట్టుకునేవాటిగా వాడుకున్నారు..

ముగ్గురూ ముందున్న హాల్ లోనే పరుపులు వేసుకుని, సోఫా మీదెక్కి ఒక దగ్గరే పడుక్కుని, దొర్లుతూ కబుర్లు చెప్పుకున్నారు.. తెల్లవారు ఝామునెప్పుడో నిద్ర పోయారు..

అలాంటిది..

ఇప్పుడు ఒక రూము తలుపు ఓరగా వేసి ఉంది, మరొకటి పూర్తిగా వేసి ఉంది..

మౌనంగా వచ్చి సోఫాలో కూర్చుని, కాళ్ళు చాపుకుని టీ.వీ పెట్టింది శ్రీదేవి..

ఓరగా ఉన్న తలుపు తీసుకుని సంధ్య వచ్చింది మొదట..

" శ్రీ, నీ సామాను నా రూములోనే ఉంది నిన్న పెట్టిన చోటే.. నువ్వు నా గదిలోనే పడుకుంటానంటే సంతోషం.. యూ ఆర్ మోస్ట్ వెల్కం..లేదూ అక్కడ పడుకుంటానన్నా నాకు ఓకే" అంది రెండో గదివైపు చూపుతూ...

" అదేమిటి?" అని అడిగేలోపు.. యామిని బయటకు వచ్చింది..

" శ్రీ, నేను కూడా అదే చెబ్దామనుకున్నా.. నీ ఇష్టం.. నీకెక్కడ కావాలంటే అక్కడే పడుక్కోవచ్చు.. డిన్నర్ టేబిల్ దగ్గర కలుద్దాం" అని గబ గబా వెళ్ళిపోయింది...

ఏం జరుగుతోందో అర్ధం కాలేదు శ్రీదేవికి...

యామిని తలుపు గట్టిగా వేసుకుని వెళ్ళిపోయాకా సంధ్య ని అడిగింది..

" సంజూ, ఏమయింది? యామిని బానే ఉందా?" అని

" శుభ్రంగా ఉంది, దానికేం వచ్చింది.. వస్తే దానివల్లమరొకరికి ఇబ్బంది రావాలి గానీ" అంది పెళుసుగా..

" అదేమిటి అలా అంటు న్నావ్?" ఆశ్చర్యం శ్రీదేవి గొంతులో..

" కాక ఇంకేం అనమంటావ్ చెప్పు? చిన్నప్పటినించీ అదే కుళ్ళుమోతు తనం.. అన్నింటిలోనూ తనే గొప్పదాన్ననుకుంటుంది.. ఇన్నేళ్ళయినా ఏమీ మార్పులేదు.. ఏళ్ళు వస్తే సరిపోయిందా? మెచ్యూరిటీ రావద్దూ..అదీ, దాని ఈగో .. ఏమీ మారలేదు" అంది సంధ్య చిన్నగా నిట్టూరుస్తూ..

" ఏదైనా అనుకున్నారా? ఇన్నేళ్ళ తర్వాత కలిసిన తర్వాత కూడానా?" శ్రీదేవి ఆశ్చర్యం మరింత ఎక్కువైంది..

సంధ్య ఏదో చెప్పేంతలో.. భోజనాలకి రమ్మని ప్రసాద్ దగ్గరనుంచి కాల్ వచ్చింది. దాంతో స్నేహితురాళ్ళిద్దరూ గబ గబా తయారయి బయటపడ్డారు..

భోజనాలవేళంతా ఒకరినొకరు తప్పించుకుంటూనే తిరిగారు యామినీ సంధ్యా...

" ఏం చెప్పిందేం మీ ఫ్రెండ్ నా మీద? అని అడిగింది యామిని శ్రీదేవి ఒక్కర్తే ఉండగా చూసి.

ఫకాల్న నవ్వింది శ్రీదేవి..

" చిన్నపిల్లలా నువ్వు కూడా ఏమిటి యామీ?" అంది శ్రీదేవి..

" అంటే ఆవిడగారు చిన్నపిల్లా, నేను పెద్దపేరక్కని అంతేగా?" అంది యామిని కోపంగా..

" ఛా నా ఉద్దేశ్యం అది కాదు.. సాయంత్రం నించీ ఇద్దరూ అదోలా ఉన్నారు కదా ! అని అన్నాను" అంది శ్రీదేవి..

దాని సంగతి నాకు చెప్పకు.. ముంబాయిలో లీడింగ్ ఇమ్మిగ్రేషన్ లాయర్ ట మళ్ళీ.. కొంచమైనా బుద్ధి లేదు. దాని ఈగో, అది.. " అంది యామిని కోపంగా..

చిన్నప్పటినించీ వాళ్ళ సంగతి తెలిసినదే కనక కాసేపైతే ఇద్దరూ సర్దుకుంటారని ఎక్కువ మాట్లాడించలేదు శ్రీదేవి..

పదకొండు దాటాకా అందరూ ఎవరి గదులకి వాళ్ళు మళ్ళారు..

అప్పటికీ ఎడమొహం పెడమొహం గా ఉన్న ఫ్రెండ్స్ ఇద్దరినీ మాట్లాడించడానికి పూనుకుంది శ్రీదేవి..

" యామీ, సంజూ, ఇన్నేళ్ళకి కలిశాము, రేపు విడిపోతే మళ్ళీ ఎప్పుడు కలుస్తామో, ఇప్పుడు కూడా ఇవన్నీ అవసరమా? ఆలోచించండి.. అసలేమయింది?" అంది నెమ్మదిగా..

" నన్నడుగుతావేం? ఆవిడగారినే అడుగు" అంది సంధ్య కోపంగా..

" శ్రీ, నేను చెప్పాను కదా, ఎన్నేళ్ళొచ్చాయన్నది కాదు, ఎంత బుద్ధి వచ్చిందన్నది ముఖ్యం అని" అంది యామిని కూడా గట్టిగా..

" వాట్ నాన్సెన్స్, నా బుద్ధి గురించి మాట్లాడే అర్హత నీకేముంది? ప్లీజ్ స్టాప్ ఇట్ నౌ" అంది..సంధ్య..

" నీతో చెప్పించుకునే అవసరం లేదు.. బాగా షో చేశావు కదా భరతనాట్యాలు చేసి" అంది యామిని అక్కసు నిండిన గొంతుతో..

" అదే కదా నీ బాధ.. నీకంటే నన్నెక్కువ మెచ్చుకున్నారని. నువ్వూ చేశావుగా".

“నేను భరతనాట్యం డ్రెస్ తెచ్చుకోలేదు, నేను తెచ్చుకున్న పట్టుచీరనే అలా కట్టుకున్నానని నీకిందాకే చెప్పాను. అయినా నాకేదో అన్నీ ముందే తెలిసి ప్లాన్ చేసుకున్నానని నువ్వనుకుంటే నేనేమీ చెయ్యలేను.. నిన్ను కన్విన్స్ చెయ్యాల్సిన అవసరం నాకు లేదు.” అంది సంధ్య తనూ

కొద్దిగా విషయం అర్థం అవసాగింది శ్రీదేవికి..

ఆమె తేరుకుని ఏదైనా చెప్పేలోపు ఇద్దరి మధ్యా మాటల యుద్ధం  మొదలైంది..

ఇద్దరు పేరుమోసిన ప్రతిభావంతులైన లాయర్లు, ఎన్నాళ్ళనించో స్నేహితులు..

విషయం చిన్నదవనీ, పెద్దదవనీ అసలేదైనా కానీ, అలా మాట్లాడుకోగలరని శ్రీదేవి అస్సలు ఊహించలేదు..

వారిద్దరినీ ఎంతో అభిమానించిన మూడో స్నేహితురాలిగా ఆమెకా పరిస్థితి మింగుడు పడడం లేదు..

ఏం చెయ్యాలో తెలీలేదు ఆమెకి..

" నీ సంగతి నాకు తెలీదా? తొమ్మిదో క్లాస్ లో నువ్వు నా పట్టుపరికిణీని చూసి ఎంత కుళ్ళుకున్నావో నాకు తెలీదనుకున్నావా?"

" నీకు చింపిరిగా ఉంగరాల జుట్టు ఉండేది, ఇప్పుడంటే స్టైలింగ్ చేయించుకున్నావు కానీ, అప్పటినించీ నీకు నా పెద్ద జడ చూస్తే ఎంత కుళ్ళో నాకూ తెలుసు...

అక్కడనించి మొదలయి ఎక్కడెక్కడి విషయాలనో తవ్వి,  తవ్వి పైకి తెచ్చుకుంటూ ఒకరినొకరు ఎన్నో అనేసుకున్నారు..

పాతకాలపు పౌరాణిక సినిమాల్లో ప్రత్యర్థులు యుద్ధానికి ముందు ఒకరినొకరు పద్యాలతో దెప్పుకున్నట్టుగా..

చిన్ననాటి స్నేహాలనించీ, ఇష్టాలనించి, తొలి ప్రేమలు.. పెళ్ళికి సంబంధించిన విషయాలు.. దాదాపు అరగంట సేపు ఇద్దరూ అనుకుం టూ నే ఉన్నారు.

శ్రీదేవి మాటలనీ, ఇంకా చెప్పాలంటే,  ఆమెనే పట్టించుకోలేదు ఇద్దరూ...

“దయచేసి ఇద్దరూ ఊరుకుంటారా? “ కాస్త గట్టిగా, దాదాపు అరిచినట్టుగానే అంది శ్రీదేవి..

ఇద్దరూ మాట్లాడలేదు.. కోపంగా ఆమె వంక చూశారు...

" ఏం చేస్తున్నారు? ఏమైనా బావుందా మీరు చేస్తున్నది?  ఆరోక్లాసునించి స్నేహితులు.. ఇన్నేళ్ళ తర్వాత కలిశాము. అంతో ఇంతో చెప్పుకోదగ్గ స్థాయిలో ఉన్నాము..

ఇప్పుడేవిటిదంతా? ఎందుకు? మళ్ళీ రేపు ఇక్కడనించి వెళ్ళిపోతే ఎప్పుడో..

ప్లీజ్.. చిన్నతనంలో అందరికీ పోటీ తత్వం ఉంటుంది.. కాదనను..

అది పెద్దయ్యాకా మాయమైపోదు.. ఒప్పుకుంటాను..

కానీ వయసు, దానితో వచ్చే విజ్ఞతా కనీసం ఎందులో పోటీ తత్వం ఉండాలి? ఎందులో ఉండక్కర్లేదనైనా చెప్పాలి కదా?

ఈరోజు సరదాగా కలిసిన స్నేహితుల కలయిక ఒక పండగ లాంటిది..

మనందరి ఇంట్లోనూ జరిగే వేడుక లాంటిది. అంతే కానీ ఇదేమీ ఇంటర్నేషనల్ కాంపిటీషన్ కాదే? దానికా మీరింతగా? అనుకుంటేనే నాకెంత ఆశ్చర్యంగా ఉందో తెలుసా?

మనం ఇంటర్ లో ఉన్నప్పుడు చూశాను మీ ఇద్దరినీ.. ఎంతో తెలివైన వాళ్ళు, ప్రతిబావంతులు, అందగత్తెలు.. ఇవన్నీ చూసి మీ మీద ఎంతో అభిమానం పెంచుకున్నాను. ఎలాగైనా మీ ఇద్దరి స్నేహం పొందాలని కోరుకున్నాను.

అది కొనసాగించడానికి ఎప్పుడూ ప్రయత్నించాను.. చిన్నప్పుడు మీ ఇద్దరి మధ్యా ఉండే పోటీ తత్వాన్ని ఎంతో ఇష్టపడేదాన్ని.. మూడోవాళ్ళకి మొదటి రాంక్ ఇవ్వకూడదని ఇద్దరూ పట్టుదలగా చదివేవారు..అలాగే ఒకరికంటే మరొకరికి ఒక్క మార్కు ఎక్కువ వస్తే అలాగే బాధ

పడేవారు.. వచ్చే పరీక్షలోనో, తర్వాతి పోటీలోనో ఒకరు రెండోవారిని అధిగమిస్తేనే కానీ నిద్ర పోయేవారు కాదు.. ఇవన్నీ అప్పుడు బావుండేవి.. నిజంగా బావుండేవి..

ఎందుకంటే చూసినవి మన చిన్నప్పటి కళ్ళు, ఆలోచించినది మన చిన్నతనపు మెదడు..

ఇప్పటికీ అదే ప్రవర్తనా? గ్రో అప్ గాల్స్.. మీ స్థాయి వాళ్ళు ప్రవర్తించవలసిన విధం కాదిది ఫ్రెండ్స్.. ప్లీజ్ దయచేసి ఇద్దరూ మాములుగా ఉండండి..

ఆ చిన్ననాటి పోటీల్లో ఒకరి మీద ఒకరు అలిగి మాటలు మానేసుకుంటే తోటి స్నేహితులుగా మేము సయోధ్య కుదిర్చే వాళ్ళము..

ఇప్పుడలా చెప్పడానికి మీరు చిన్నపిల్లలు కాదు.. అయినా చిన్నప్పటి స్నేహితురాలిగా చెప్తాను. అప్పటిలా నేను ముందెందుకు మాట్లాడాలి? అని కాకుండా ఉన్న రెండురోజులు సరదాగా ఉందాం.. ప్లీజ్

ఏం జరిగింది అని కూడా అడగనిప్పుడు.. జరిగినది మర్చిపోండి." అంది..చాలా నెమ్మదిగా, అనునయంగా..

ఇద్దరూ మాట్లాడలేదు..

మౌనంగా చెరో గదిలోకి వెళ్ళిపోయారు..

నిన్న ముగ్గురి నవ్వులతో హోరెత్తిన ఆ లివింగ్ రూం సౌండ్ తగ్గించిన టీవీలా మూగవోయినట్టుగా ఉండిపోయింది..

పెద్దగా తర్కించి, పొడిగించే ప్రయత్నం చెయ్యడం ఆమె పద్ధతి కాదు..

అక్కడే సోఫాలో పడుకుంది.. పొద్దున్నకి చల్లబడతారేమో అనుకుంటూ...

తెల్లారింది..

ఇద్దరిలోనూ ఏ మార్పూ కనబడలేదు..

ఇద్దరూ తమ పెట్టెలు సర్దుకున్నట్లుగా తెలుస్తోంది.. ఒకరి వెనక మరొకరు వచ్చారు..

మిగతావారితో కలవడం.. గ్రూప్ ఫోటోలు... భోజనాలు అయ్యాకా అందరూ ఖాళీ చేసి గేటు దగ్గరకొచ్చారు..

'ఇన్నాళ్ళ తర్వాత నిన్ను కలవడం చాలా బావుంది శ్రీ.. నువ్వేమీ మారలేదు. అదే నెమ్మది, అదే ప్రవర్తనా.. 'ఇద్దరూ ఇంచుమించుగా అదే చెప్పారు..

"నా సంగతి సరే, మీరూ మారలేదా? కనీసం వెళ్ళేముందు ఒకరికొకరు వీడ్కోలైనా చెప్పుకోరా? పొద్దున్నించీ ఏమీ మాట్లాడుకోలేదు ఇప్పటివరకూ.. " అంది శ్రీదేవి..

అదేమౌనం ఇద్దరి మధ్యా..

ఇద్దరూ చెరో పక్కనుంచీ ఎయిర్ పోర్ట్ కి వెళ్ళే బస్ ఎక్కారు..

ఇద్దరినీ చూస్తూ చేసేదేమీ లేక తన కార్ వైపు నడిచింది శ్రీదేవి..

●●●

Click here to share your comments on this story